# రాజూ, మంత్రీ...

'—శేషయ్యా ? చెప్పావు కాదేమోయ్ ?...'

'ఏమిటండీ ?'

'ఇంకా ఏమిటని మెల్లిగా అడుగుతున్నావా—ఏం నంగనాచితనం?'

'చిత్తం! నావల్ల ఏదైనా పొరబాటుంటే...'

'ఎన్నిసార్లని క్షమించమన్నావోయ్?'

'చిత్తం! మళ్ళీ ఏం బుద్ధితక్కువ పని చేశానండీ ?'

'మంత్రీ! శేషయ్యా! నా ప్రాణం విసిగిపోతూందోయ్. నీ మూలంగా—'

'అయ్యయ్యో! హడలగొట్టి చంపేస్తున్నారు నన్ను—ఇది తమకు న్యాయం కాదు—'

'శేషయ్యాధమా! కట్టిపెట్టు ఈ వేషాలు-చూస్తున్నా నీ పంచమాంగదళ ప్రవర్తనంతా...'

'ప్రభువులు నా పాలిటికి అత్తగారిలా వున్నారు. ఇంత కోడంట్రికం భరించలేను. ఇంతకన్నా తమ చేత్తోనే ఈ పీకను తీసివేస్తే మేలు-దేవా! నలిపి నలిపి చంపక నా అపరాధమేమిటో శెలవిస్తారా?'

'శేషయ్యా! నీ తెలివితేటలు భగ్గమయ్యాయి-నా పరిపాలనకు అప్రదిష్ట తెలుస్తున్నావు-సాటి సంస్థానాలవారి మధ్య నాకు తలవంపులు తెస్తున్నావు...'

'ఉపోద్ఘాతాలు మనకి వొద్దండి-నా నేరం నాకు తెలియజేసి నన్ను ఉరితీయండి—'

'తీస్తాను-తొందరపడకు-ఇప్పుడు మనదేశమంతటా, అన్ని రాష్ట్రాల లోనూ, అన్ని సంస్థానాలలోనూ ఏం జరుగుతూందో తెలుసా నీకూ ?

'చిత్తం! కాంగ్రెసు జైల్లో వుందండి, చవటలంతా పరిపాలనా హయాంలో వున్నారండి, జపానువాడు మణిపూర్‌ను సమీపిస్తున్నాడండి.'

'ఛీ ఛీ ఛీ! ఈ సోది కాదు నేను అడిగింది-'

'పోతే, రైల్వే రేట్లు హెచ్చించడానికి ప్రభుత్వానికి కలేజా లేక పోయిందండి, సౌత్ ఈస్టు ఆసియా కమాండ్ ఢిల్లీనుంచి సింహళ ద్వీపానికి లేచిపోయిందండి, బొంబాయి రేవులో ఓడ తగులపడి గొప్ప అగ్నిప్రమాదం సంభవించిదండి, మద్రాసులో దుర్గాయిగారు 'ఆంధ్ర మహిళ'ను ప్రారంభించడానికి ప్రభుత్వపు అనుమతి పొందేరండి...'

'ఆగు ఆగు శేషయ్యా! అమృతాంజనం చాలా ప్రియంగా వుంది-ఇంతకంటే మన దేశంలో జరుగుతూండే సంగతులేమీ నీకు తట్టలేదా?'

'అనేకం తట్టుతున్నాయండి-కాని అందులో ఒకటీకూడా మీకు-మీ మనస్సుకు దగ్గరగా రాలేకపోతూంది-నలిపి చంపడం మాని అదేదో మీరే శలవిస్తే...'

'చూడూ, మనదేశంలో నేడు అంతటా జరుగుతూండే విషయాలలో రేషనింగు ఒకటి కాదూ?'

'కాదని ఎవరన్నారండీ?'

'అయితే చెవలమ్మా-మన సంస్థానంలోకూడా అది అమలులో పెట్టాలన్న సంగతి-ఆ మాత్రం లోకజ్ఞానం-నీకు వుండనక్ఖర్లేదూ-సాటివాళ్ల మధ్య ఎంత చిన్నతనమోయ్ మనకీ?'

'నాకు మతిపోయిందండి-మన సంస్థానంలో రేషనింగు అవసర మేమున్నదండీ?...'

'ఛీ ఛీ! నీ తెలివి నేలపడా! సాటిరాష్ట్రాలూ సంస్థానాలూ అన్నీ అంత అభివృద్ధికరమైన మార్గాలు అవలంబిస్తూంటే మనం...'

'మనకి బియ్యపుకరువు లేదండి. మన సంస్థానాలో పండినపంట మనకు పదేళ్లదాకా సరిపోతుందండి-'

'శేషయ్యా-ఈ నాటకాలు కట్టిపెట్టు - మన సంస్థానంలో ఇరవై నాలుగ్గంటలలోగా రేషనింగు అమల్లోకి రావాలి-'

'బాబూ! నామాట వినరూ-ఈ విధంగావచ్చే అప్రదిష్ట-'

'ఉహూం! శేషయ్యా-నీ వట్టిగడ్డి కబుర్లు కాస్సేపు కట్టిపెట్టు-రేపీ పాటికి మన సంస్థానంలో రేషన్ డిపోలు తెరవాలి-'

‘అయ్యో దేముడా! ఇదెక్కడి...’

‘శేషయ్యా! విను నామాట-ఏ విషయంలోనూ మన సంస్థానం వెనకబడి వుండకూడదని లక్షసార్లు నీకు-’

‘నా మాట కాస్త చెవిని పెట్టరూ-మన సంస్థానంలో ఎవరికీ బియ్యానికి లోటులేదు. కావలసినంత పంట-అందరికీ తింటానికి కావలసినంత తిండి-ఈ పరిస్థితులలో మనం మనిషికి రోజుకి రెండశాకుల చొప్పున పంచి యివ్వవలసినంత ఖర్మమేమొచ్చిందండీ?’

‘శేషయ్యా! నాకో గొప్ప ఆలోచన తట్టింది-అకస్మాత్తుగా-’

‘అది మంచి ఆలోచన కాగలందులకు భగవంతుడ్ని ప్రార్థిస్తున్నా-’

‘విను శేషయ్యా! పేరు ప్రతిష్టలకోసం మనం రేషనింగు ఎలాగా పెట్టి తీరాలి-’

‘అయ్యో! రాముడా!—ఎందులో నేనా పడి చచ్చిపోతాను-’

‘విను! విను! విను! పేరుకోసం మనంకూడా రేషనింగు పెట్టాలని చెప్పాను-కాదూ?’

‘అవునండి! నా మొహం తగలెయ్యా!’

‘తల మొత్తుకోకు! పేరుకోసం మట్టుకే, సాటివాళ్ళ మధ్య తల ఎత్తుకోవడం కోసరమే మనం రేషనింగు పెడతున్నాం - కాని, ఈ విధానంద్వారా మనం ఓ గొప్పపేరు కొట్టెయ్యడానికి ఛాన్సు వుంది-’

‘మీకు నిజంగా మతి పోయిందండి. మందపల్లి వెడదాం పదండి-అక్కడ కొన్నాళ్ళుంటే మీమనస్సు కాస్త కుదుట పడతుంది-’

‘విను! శేషయ్యా! మనం అందరిలాగా రేషనింగు పెట్టబోతున్నాం-కాని, నిజానికి అందరిలాగా కాదు-అందరికన్నా బాగా-’

‘ఏమిటో-ఇంక రోకలి తలకు చుట్టుకోవడం తరవాయి-’

శేషయ్యా! ఇప్పుడు ఈ అన్నిచోటా జరుగుతూంటే రేషనింగు చాలా దరిద్రంగావుంది-మనిషికి రెండశాకులుట!—’

‘మీ కెందుకండీ ఆ రభసంతా? పనిలేని మం...’

శేషయ్యా! మన సంస్థానంలో మనం రేషనింగు పెట్టి మనిషి ఒక్కంటికి రోజుక కుంచెడు బియ్యం ఇస్తాం - ఘనంగా లేదూ?’

‘..............’